క్లుప్తంగా

మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ మృతి


మృతి చెందిన జీఎం లక్ష్మీదేవమ్మ(ఫైల్)

పాములపాడు: మాజీ ఎంపీపీ జీఎం లక్ష్మీదేవమ్మ(82) ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 10న ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాద వశాత్తు చీరకొంగుకు నిప్పంటుకొని గాయపడ్డారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా పరిస్థితి విషమంగా మారడంతో ఈ నెల 13న హైదరాబాదుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కోలుకోలేక అక్కడే మృతి చెందింది. 1996లో మండలంలోని ఇస్కాల గ్రామం నుంచి ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. నేడు మండల కేంద్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు


దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని కప్పి ఉంచిన ముసుగు

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసినా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కప్పిన ముసుగు ఆదివారం నాటికి కూడా తొలగించలేదు. ఏప్రిల్ 18న సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండల కేంద్రంలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి అధికారులు ముసుగు వేశారు. అయితే కోడ్ ముగిసి పది రోజులు గడిచినా అధికారులు ముసుగు తొలగించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహానందిలో భక్తుల సందడి


మహానందీశ్వరుడి దర్శనానికి బారులుదీరిన భక్తులు

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు,మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్ర,బ్రహ్మ,విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. మహానందీశ్వరుడి దంపతులకు రాత్రి ఏకాంత సేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

మాట తప్పని నేత చంద్రబాబు

ఆత్మకూరు: ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రధాన అంశాలైన ఐదింటిపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో వివిధ కళాశాలల నుంచి 4.4 లక్షల మంది విద్యార్థులు ప్రతియేటా బయటకు వస్తున్నారని, సరైన నైపుణ్యాలు లేక చాలా మంది నిరుద్యోగులుగా మిగులిపోతున్నారని వారి కోసమే నైపుణ్య గణన చేసి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై సంతకం చేశారని పేర్కొన్నారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు గ్రామంలో కొలువైన శ్రీ కోదండ రామ,ఈశ్వర,చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన 5.17 ఎకరాలకు కౌలు వేలాల ద్వారా గతంలో రూ.70 వేలు రాగా ఈ ఏడాది రూ.73,500 వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఓంకార సిద్ధేశ్వస్వామి దేవస్థానికి చెందిన 2.50 ఎకరాలకు గతేడాది రూ.49 వేలు రాగా ప్రస్తుతం రూ.85 వేలు వచ్చిందన్నారు. బీ.కోడూరులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానానికి చెందిన 51.53 ఎకరాలకు నిర్వహించిన కౌలు వేలం ద్వారా గత ఏడాది రూ.3,65,500 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.5.34 లక్షలు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమాల్లో నంద్యాల డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్,సిబ్బంది నాగరాజు రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ధార సుధీర్

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ ధార సుధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గ ప్రజల గుండెలో స్థానం దక్కిందని చెప్పారు. ఓటమి కారణాలపై చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. గెలుపోటములు సహజమని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఎళ్లవేళలా అండగా ఉంటానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు లాలు, కృష్ణ, సురేష్, నాయబ్, హామీద్, అశోక్, జెడ్పీటీసీ జగదీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు నాగిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, జబ్బార్, తులసిరెడ్డి, లోకేష్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రామకృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఉస్మాన్‌బేగ్, రమేష్, బ్రహ్మయ్య, శాలు, కుర్వ శ్రీనివాసులు, రజినీ కమార్‌రెడ్డి, నక్క మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బీసీకి మహానందీశ్వరుడి ప్రసాదం


మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి దంపతులకు మహానందీశ్వరుడి మెమొంటోను అందిస్తున్న ఈఓ,వేద పండితులు

మహానంది: రోడ్లు భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బీసీ జనార్ధన్‌రెడ్డికి ఆదివారం మహానందీశ్వరుడి ప్రసాదం అందించారు. ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి,వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని,ఉప ప్రధానార్చకులు జనార్ధనశర్మ తదితరులు బనగానపల్లెలోని స్వగృహంలో మంత్రిని కలిసి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలతో పాటు మెమొంటోను అందజేసి సత్కరించారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన శ్రీశైలం ఈఓ


ఆనం రామనారాయణ రెడ్డికి స్వామి,అమ్మ వార్ల జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వేదాశీర్వచనంతో శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డు ప్రసాదం అందజేశారు. అర్చకస్వాములు, వేదపండితులు పాల్గొన్నారు.

తరలిపోతున్న వృక్ష సంపద


నర్సాపురం సమీపంలో భారీ చెట్లను నరికి ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాలు,నల్లమల అటవీ సమీప ప్రాంతాల నుంచి కొందరు దుండగులు పెద్ద పెద్ద వృక్షాలను కూల్చి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ట్రాక్టర్లలో భారీ వృక్షాల మొద్దులను తరలించుకెళ్తున్నప్పటికీ రెవెన్యూ,అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారుల పక్కన,వాగులు, వంకల గట్లపై, ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను కూల్చి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అలాగే చెట్లను ఇష్టానుసారంగా కూల్చడం వల్ల పృదనం కనుమరుగై వాతావరణ సమతుల్యతకు భంగం వాటిల్లే ప్రమాదముందని పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అనుమతులు లేకుండా చెట్లను కూల్చేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిమళించిన పచ్చదనం

కొత్తపల్లి: విస్తారంగా వర్షాలు కురువడంతో పచ్చదనం పరమళిస్తుంది. ఖరీఫ్ సీజన్ జూన్ 1 ప్రారంభవ్వగా వర్షాలు సైతం అప్పటి నుంచి కురుస్తూనే ఉన్నాయి. దీంతో పుడమిపై ఎక్కడ చూసిన పచ్చదనం మెరుస్తుంది. ఇప్పటివరకు బీడుభూములుగా దర్శనమిచ్చిన పొలాలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. మూగజీవాలు సైతం వేసవిలో మేతకోసం ఇబ్బందులు పడ్డాయి. బర్రెలు, ఆవులు, గొర్రెలు తదితర పశువులకు పచ్చని గడ్డి లభించింది.


పాలెంచెరువుగూడెం సమీపంలో పచ్చని గడ్డిని మేస్తున్న ఆవులు,బర్రెలు

మహానందీశ్వరుడి సన్నిధిలో..


మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన అన్నమయ్య జిల్లా డీపీఓ పార్వతి

మహానంది: మహానందీశ్వరుడిని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి పార్వతి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠ రాజు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఉపాధి పనులు కల్పిస్తాం

జూపాడుబంగ్లా: టార్గెట్ పూర్తికానందున వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే వరకు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ గౌరీబాయి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని తాటిపాడు, పారుమంచాల, తరిగోపుల గ్రామాల్లో ఉపాధి పనులు నిర్ణీత టార్గెట్‌ను చేరుకోలేదన్నారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర కార్యదర్శి ఎంపికపై హర్షం


కుమ్మరి నాగరాజు

పగిడ్యాల: ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కుమ్మరి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికపై విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారని అభినందించారు.

కేసీ కాల్వలో వర్షపు నీటి ప్రవాహం


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న వర్షం నీరు

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వలో వరదనీటి ప్రవాహం ప్రారంభంకావటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే తొందరపడి ఆయకట్టు పంటలు సాగుచేసుకోవద్దని ఏఈ శ్రీనివాసనాయక్ పేర్కొంటున్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల జలాశయం నుంచి కర్నూలు పట్టణ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 500క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే వరుసగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లోని నీరు కేసీ కాల్వలో కలుస్తున్నట్లు తెలిపారు. దీంతో కేసీ కాల్వలో 750క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతుందన్నారు.

చిరుత సంచారంపై భయం భయం

మహానంది: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోకి చిరుత రావడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అటవీ శాఖ డీఆర్ఓ హైమావతి, ఎఫ్‌డీఓ ప్రతాప్, సిబ్బంది ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని చిరుత పాదముద్రలను సేకరించారు. వారు మాట్లాడుతూ అటవీ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత జాడ, కదలికలు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వవిద్యార్థులు

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 1993–94 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఒకేవేదికపై చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గురువుల ప్రాముఖ్యతను పూర్వ విద్యార్థులు గుర్తు చేశారు. అనంతరం గురువులను పూర్వవిద్యార్థులు సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్ర


మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన శ్రవణ్‌కుమార్, కుటుంబ సభ్యులు

మహానంది: కోరిన కోరిక నెరవేరడంతో హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్రగా వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు ఆ కుటుంబ సభ్యులు. వినుకొండ పట్టణానికి చెందిన శ్రవణ్ కుమార్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తన చెల్లిలికి వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేకపోవడంతో మహానంది ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టగా ఆమెకు సంతానం కలిగింది. కోరిక నెరవేరడంతో చెల్లెలు శాంతి, బావ లక్ష్మిశ్రీనివాస్ మహానంది ఆలయానికి చేరుకొని కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి అమ్మవార్ల అనుగ్రహం వల్ల తమ కోరిక నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సబ్సిడీ విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏఓ పీరునాయక్ ఆధ్వర్యంలో సబ్సిడీ విత్తనాలను రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు మేలు రకం విత్తనాలు ఎంపికచేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై నిఘా ఉంచి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఏడీఏ విజయశేఖర్, ఏఓ పీరునాయక్, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుండం రమణా రెడ్డి, సీనియర్ నాయకులు వంగాల శివరామిరెడ్డి, కమతం వీరారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరులో ఆదివారం రైతులకు ఎమ్మెల్యే జయసూర్య సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానంద రెడ్డి, ఏడీఏ విజయశేఖర్, ఏఓ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మహానంది: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న నరసింహ (18) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, నొప్పిని తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అ'పూర్వ' కలయిక


రాయసం రత్నస్వామిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వెలుగోడు: పట్టణంలోని శ్రీ నీలం సంజీవరెడ్డి డిగ్రీ కాలేజీలో 1987–90 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు ఆదివారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తరలివచ్చారు. నాలుగు దశాబ్దాల తర్వాత కుటుంబాలతో వచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. కమిటీ వేసుకొని మిత్రులందరినీ కలవడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఎస్ఎన్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు తమకు బోధించిన అధ్యాపకులను, కరస్పాండెంట్ రాయసం రత్నస్వామిని సన్మానించారు. పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంభూపాల్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు జనార్దన్ రెడ్డి, శ్యామప్రసాద్ శర్మ, నారాయణ రెడ్డి, దొరస్వామి పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలో వెలసిన హజ్రత్ సయ్యద్ దర్వేష్ షా ఖాద్రీ స్వాముల వారి గంధోత్సవం ఆదివారం వైస్ ఎంపీపీ ముల్లా రఫీ ఇంటి నుంచి మేళ తాళాలతో, ఫక్కీర్లతో కలిసి పెద్దమకానం, మొయిన్ బజార్‌ల మీదుగా ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి దర్గా వద్ద స్వామి వారికి గంధం, చాదరు, బాసికాలు సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆదివారం గంధం, 17న ఉరుసు, 18వ తేదీన జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

వీఆర్‌ఏ పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. వీఆర్‌ఏ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రస్తుత ప్రభుత్వం పే స్కేల్ అమలు చేసి 60ఏళ్లు పైబడిన వృద్ధుల స్థానంలో వారి వారసులను నామిని వీఆర్‌ఏలుగా నియమించాలంటూ ఆదివారం న్యాయశాఖ, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు విన్నవించారు. వీఆర్‌ఏల వేతనాల పెంపుపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

పచ్చిరొట్ట.. పోషకాల పుట్ట

- నీటి సాగుతో పెరగనున్న భూసారం, దిగుబడి
- తగ్గనున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం
- ఖరీఫ్‌కు ముందు పెంపకంతో అధిక ప్రయోజనం
- జీలుగ, పిల్లి పెసర, జనుము సాగుకు ప్రాధాన్యం
- 50 శాతం రాయితీపై ఆర్బీకేల్లో పంపిణీ

ఏడాది పొడువునా పొలానికి విరామం లేకుండా పంటలు సాగు చేయడం, ఎరువులు, పురుగు మందులు మితిమీరిన వినియోగంతో భూములు నిస్సారంగా మారుతున్నాయి. ఫలితంగా దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సాగు ప్రారంభంలో పచ్చిరొట్ట, అపరాల సాగు ద్వారా భూసారం పెంచుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో వరి నాట్లు వేసే ముందు సేంద్రియ ఎరువులు వినియోగించాలని చెబుతున్నారు. ఇందులో భాగంగా జీలుగ, పిల్లిపెసర, జనుము తదితర విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుంది.


రుద్రవరం మండలం పరిధిలో సాగైన జీలుగ


బాచేపల్లి ఆర్బీకేలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

ఆళ్లగడ్డ: రసాయనిక ఎరువులు ఇష్టారాజ్యంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. దిగుబడులు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద ఏటికేడు తగ్గిపోతుండటంతో సేంద్రియ ఎరువులు వాడకం తగ్గింది. చేసేది లేక రైతులు రసాయానిక ఎరువులపై ఆధారపడి నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఈ క్రమంలో పెట్టుబడులను నియంత్రించడంతో పాటు భూసారాన్ని పెంచి.. నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ ఆర్బీకేల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచింది. పచ్చిరొట్టతో భూమి సారవంతంగా మారుతుందని రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువు వాడకం ఇలా..

పచ్చిరొట్ట పైర్లను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే త్వరగా కుళ్లుతుంది. ప్రధాన పంటకు ఈ 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. పచ్చిరొట్ట మురగకుండా వేరే పంటలు వేయకూడదు. పచ్చిరొట్ట సాగు చేసే పొలాల్ల నత్రజని తక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క పెరిగి రొట్ట ఎక్కువ వస్తుంది. కాగా..జనుము ఎకరాకు 8 నుంచి 10 కిలోలు, జీలుగ ఎకరాకు 12 నుంచి 14 కిలోలు, పిల్లి పెసర ఎకరాకు 6 నుంచి 8 కిలోల విత్తనాలు వేయాలని అధికారులు పేర్కొంటున్నారు.

పెరగనున్న భూసారం..

భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లేటప్పుడు విడుదల చేసే ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు భాస్వరం, పొటాష్ అందడమే కాక గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడటంతో నేల సారం పెరుగుతుంది. భూమికి సేంద్రియ పదార్థం అందడం వల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి తద్వార పంట వేర్ల ఆరోగ్యం, పటుత్వం పెరుగుతుంది. ఫలితంగా చీడపీడలు బెడద తగ్గుతుంది. సూక్ష్మ పోషకాలు ఎక్కువగా పంటలకు లభిస్తాయి. తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన దిగుబడి సాధించవచ్చు

భూమిలో నైట్రోజన్ పెంపు..

వరి చేలల్లోని పొలాల్లో నైట్రోజన్ పెంపునకు పచ్చి రొట్ట ఎరువు అధికంగా ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా చౌడు భూముల్లో ఉన్న చౌడు విరిగిపోయి భూసారం పెంచేందుకు జీలుగ దోహదపడుతోంది. జీలుగ, జనుము పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది. ఉప్పునీరు ఉన్న ప్రాంతాల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది. సారవంతమైన భూమిలో ఎరువులు ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. పురుగు, చీడపీడల నివారణ మందుల వినియోగమూ తక్కువే.

మండలాల వారీగా వరి సాగు విస్తీర్ణం, అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

మండలం	ఆర్బీకేలు	రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు (క్వింటాళ్లలో)
రుద్రవరం	16	9,713	16,542	230
దొర్నిపాడు	9	4,360	10,574	35
ఆళ్లగడ్డ	12	11,280	19,250	215
శిరివెళ్ల	16	10,794	18,967	570
ఉయ్యలవాడ	11	5,794	18,344	55
చాగలమర్రి	17	12,546	20,147	000

ఏటా జీలుగ సాగు చేస్తా



వరినాట్లు వేసే ముందు పచ్చిరొట్ట సాగు చేస్తే మేలని అధికారులు సూచిస్తుండటంతో మూడేళ్లుగా జీలుగ సాగు చేసి పూతకు వచ్చిన తరువాత భూమిలో కలియదున్ని వరి నాట్లు వేస్తున్నాం. దీంతో రసాయనిక ఎరువుల ఖర్చు చాలా వరకు తగ్గింది. వడ్లు కూడా తాలు లేకుండా, బియ్యం గింజ విరగకుండా చాలా నాణ్యత పండటంతో పాటు దిగుబడులు కూడా ఎక్కువగానే వస్తున్నాయి.

– లింగన్న, రైతు, తిప్పారెడ్డిపల్లె

రసాయన ఎరువుల వాడకం తగ్గింది



ప్రభుత్వం సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ప్రతి సంవత్సరం జీలుగ సాగు చేస్తున్నా. దీంతో పొలంలో అక్కడక్కడా ఉన్న చౌడు తగ్గిపోయింది. రసాయన ఎరువులు వేసి సాగు చేసిన దానికంటే పచ్చిరొట్ట ఎరువులతో సాగుచేసిన వడ్లు నాణ్యతగా ఉంటున్నాయి. పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకం కూడా తగ్గింది. – పుల్లయ్య, రైతు, క్రిష్టిపాడు

పచ్చిరొట్ట వైపు రైతుల మొగ్గు



రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి మెరుగైన, నాణ్యమైన దిగుబడులే లక్ష్యంగా ప్రభుత్వ అన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రతి ఆర్బీకేలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 50 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతోంది. గతంలో కంటే ప్రస్తుతం రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు. – నాగేంద్రప్రసాద్, ఇన్‌చార్జి ఏడీఏ